
ప్రజాశక్తి

శనివారం 21 డిసెంబర్ 2024



నేడు తోటపల్లి ప్రాజెక్టు చైర్మన్ ఎన్నిక

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 21న తోటపల్లి పాత ఆయకట్టు ప్రాజెక్టు చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు ఇరిగేషన్ ఎఇ ఇడి వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి అయిన డ్వామా పీడీ కె.రామచంద్రరావు ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహించనున్నామని తెలిపారు. వీరఘట్టం, తూడి, రావివలస, రాజులగుమ్మడ, ఎం.సింగపురం డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్లు ప్రాజెక్టు చైర్మన్‌గా ఎన్నుకొనున్నారని ఆయన తెలిపారు.

అల్పపీడనంతో అన్నదాతల్లో ఆందోళన

- చితికిపోతున్న చిరువ్యాపారులు
- ఉపాధి కోల్పోయిన రోజువారీ కూలీలు



ధాన్యం బస్తాలపై టార్పాలిన్లు కప్పిన రైతులు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లా మూడు రోజులుగా కురుస్తున్న వర్షం గురువారం సాయంత్రం నుంచి ఎక్కువైంది. ఎడతెరిపిలేకుండా జల్లులు కురుస్తున్నాయి. దీంతో, గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం 8గంటల వరకు జిల్లాలో జిల్లాలో సరాసరి 8.5మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తరువాత అర్ధరాత్రి వరకు కూడా అదే స్థాయిలో వర్షం కురిసింది. దీంతో, పల్లపు భూములు జలమయమయ్యాయి. ముఖ్యంగా పొలాల గట్లపైన ఉండిపోయిన వరిచేను పూర్తిగా పదునెక్కింది. వరి దిబ్బలు కూడా తడితో నెమ్ముకున్నాయి.పత్తి పంట తడిచి ముద్దయింది. మరోవైపు ఈ అకాల వర్షంతో వ్యవసాయం, భవన నిర్మాణం తదితర రంగాలకు చెందిన కార్మికులు కూలి పనులు కోల్పోయారు. పట్టణ ప్రాంతాల్లో ఫుట్‌పాత్ వ్యాపారాలు, తోపుడు బండ్ల వ్యాపారులు కూడా ఉపాధి కోల్పోయారు.

ప్రజాశక్తి - కురుపాం/గుమ్మలక్ష్మీపురం/పాలకొండ/ వీరఘట్టం/సాలూరురూరల్

కురుపాం మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం అంతా ఎడతెరిపి లేకుండా చిన్న చిన్న వర్షం, చిరుజల్లులు పడుతూ ముసురు పట్టుకుంది. వరి పంట చేతికి అందొచ్చే సమయంలో ఇలా ముసురు పెట్టడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పలువురు రైతులు ఆదరాబాదరాగా కుప్పలు పెడుతూ కల్లాల్లో ఉన్న ధాన్యంపై టార్పిలిన్లు కప్పుతున్నారు. తుఫాను నేపథ్యంలో ముందస్తుగా చర్యలు తీసుకోవాలని రైతులకు అధికారులు సూచనలు చేశారు. అనేక గ్రామాల్లో ఇంకా నూర్పులు పూర్తి కాలేదు. కల్లాల్లో కుప్పలు వేసి వరి దిబ్బలపైనా, నూర్చిన ధాన్యం బస్తాలపై టార్పిలిన్లు కప్పి రైతులు పంటను పక్క కాపాడుకుంటున్నారు. అయిన్నప్పటికీ ధాన్యం తేమ శాతం పెరుగుతూ పాడవుతాయామోనని మరోపక్క రైతులు ఆందోళన చెందుతున్నారు. గుమ్మలక్ష్మీపురం మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి. మరోవైపు వర్షంతో వరి, పత్తి పంటలు తడిసి ముద్దయ్యాయి. జియమ్మవలస మండలంలో రైతులు వరి చేలు తడవకుండా కుప్పలుగా వేశారు. పత్తి పంట పూర్తిగా తడిసి ముద్దయింది. పలుచోట్ల రోడ్లపై నీరు చేరడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కూరగాయలు, పండ్లు వ్యాపారులు అమ్మకాలు నిలిపివేశారు. వీరఘట్టం మండలంలో కోసిన పంటను రైతులు కుప్పలు వేసి దానిపైన టార్పలిన్లు కప్పి పంటను కాపాడుకుంటున్నారు. మరోవైపు నూర్చిన పంట కొనుగోలు లేక ధాన్యం తడవకుండా ఉండేందుకు బస్తాలపైన టార్పాన్లు కప్పి వాటిపై గడ్డివాములు వేసి పండించిన పంట వృథా కాకుండా ఉండేందుకు నానా అవస్థలుపడు తున్నారు. పాలకొండ మండలంలోని అంపిలి, అన్నవరం, గోపాలపురం, వడమ, బాసూరు, కొండాపురం తదితర గ్రామాల్లో ధాన్యం బస్తాల్లో ఉంచి కొనుగోలు కేంద్రాలకు తీసుకుని వెళ్లడానికి సిద్ధమవుతున్న తరుణంలో తుఫాను కారణంగా ధాన్యం తడిచిముద్దవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరికొన్ని చోట్ల వరికప్పలు కూడా తడిసిపోతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాఖ ఎడిఎ ఎం.మధుసూదనరావు తెలిపారు. సాలూరు మండలంలో ఇప్పట ివరకు వరి కోతలైన ఖరాసువలస, కొత్తవలస తదితర రైతు సేవా కేంద్రాల పరిధిలో గల పలు గ్రామాలను శుక్రవారం సందర్శించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ వర్షం పడుతున్న కారణంగా పొలంలో నీరు నిలబడకుండా ఎప్పటికప్పుడు నీరు బయటకు పోయేలా చూసుకోవాలని తెలిపారు. మండలంలో 80 టార్పలిన్లు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు సంబధిత రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అనురాధ పండా, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం తరలింపునకు తుఫాను గండం


పార్వతీపురం రూరల్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జల్లుల వల్ల రైతులు ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అడ్డంకిగా మారింది. మిల్లర్లు సహకరించకపోవడంతో ఆగిపోయిన ధాన్యం కొనుగోళ్లు ఇటీవల రెవెన్యూ అధికారుల చొరవతో ఒక్కసారి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. దీంతో ధాన్యం తరలింపునకు వాహనాల కొరత ఏర్పడింది. వీటిని అధిగమించి వాహనాలను గ్రామాల్లోకి పంపించి రైతుల వద్దనున్న ధాన్యాన్ని మిల్లులకు తరలింపు జోరందుకుంది. ఈ సమయంలో అకస్మాత్తుగా వాతావరణం మారి, జల్లులు కురుస్తున్నాయి. దీంతో ధాన్యాన్ని కళ్లాల్లో నిలువు చేయలేక, వాహనాల్లో లోడ్ చేయలేక రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాతావరణ శాఖ అధికారుల సూచనల మేరకు మరో మూడు రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని ప్రకటించడంతో, రైతులు ఏం చేయాలో తెలియనిస్థితికి చేరుకున్నారు.



గుమ్మలక్ష్మీపురం : వర్షానికి నేలరాలిపోతున్న పత్తి

చితికిపోతున్న చిరువ్యాపారులు.. రోజువారీ కూలీలు

పార్వతీపురం టౌన్ : అకాల వర్షాలతో రైతులతో పాటు చిరు వ్యాపారులు, ఫుట్ పాత్ వ్యాపారులతో పాటు, రోజువారీ పనులకు వెళ్లే భవన నిర్మాణ కార్మికులు, వెల్డింగ్ పనులు చేసేవారు, రోజువారీ కూలీలు పనులకు వెళ్లేందుకు అవకాశం లేక ఇళ్లకే పరిమితమవుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం నుంచి చిరుజల్లులు కురుస్తున్నా గురువారం రాత్రి నుంచి ఏకధాటగా కురుస్తున్న వర్షంతో అన్ని వర్గాల వారు అవస్థలు పడుతున్నారు. మరో నాలుగు రోజుల్లో క్రిస్మస్, రెండు వారాల్లో సంక్రాంతి పండగ వస్తున్న నేపథ్యంలో తమ కుటుంబ ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న తరుణంలో అకస్మాత్తుగా కురిసిన ఈ అకాల వర్షాల వల్ల పనుల్లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రెండు పండగలకు తమ వ్యాపారాలు బాగానే ఉంటావని ఆలోచనతో ఉన్న ఫుట్పాత్, ఇతర వ్యాపారులు నిరాశతో ఉన్నారు.



వీరఘట్టంలో వరికుప్పలపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

జోరువానలో పవన్ పర్యటన

డిప్యూటీ సిఎంకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం



మహిళా సంఘ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - సాలూరు/మక్కువ

జోరువానలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ పర్యటన సాగింది. మక్కువ మండలం బాగుజోల నుంచి సీరివర గ్రామం వరకు రూ. 9.5 కోట్లతో 9 కిలోమీటర్ల రోడ్డు పనులకు స్విచ్ ఆన్ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం పనసభద్ర పంచాయతీ పరిధిలోని మహిళా సంఘాలకు రూ.4కోట్ల 14 లక్షల 72 వేల చెక్కును అందజేశారు. తొలుత గిరిజన గ్రామాల్లో కాలి నడకన పర్యటిస్తూ అక్కడ స్థితిగతులను స్వయంగా పరిశీలించారు. గిరిజన గ్రామాల్లో అంతర్గత రహదారులను పరిశీలించి ఎప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలిచ్చారు. మక్కువ మండలం, కవిరిపల్లి ప్రారంభం నుంచి చివర వరకు నడిచారు. చీపురువలస సమీపంలోని వెంగళరాయసాగర్ వ్యూపాయింట్ వద్ద ఆగి ప్రకృతి అందాలను తిలకించారు. కొండలు, జలపాతాలను స్వయంగా మొబైల్‌లో బంధించారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని, ఇక్కడ అడ్వంచర్ టూరిజం అభివృద్ధి చేయాలని, అందుకు సంబంధించిన వివరాలను సంబంధిత శాఖకు తెలియచేయాలని అధికారులకు సూచించారు. అనంతరం శంబరలోని పోలమాంబ ఆలయం వద్ద పనికి ఆహార పథకం నిధులతో కొత్తగా నిర్మించిన సిమెంట్ రోడ్డును పరిశీలించారు. రోడ్డు నాణ్యత, నిర్మాణ వ్యయం తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కొత్త రోడ్డును తన మొబైల్‌లో వీడియో తీసుకున్నారు. అనంతరం కిలోమీటర్ దూరంలో ఉన్న చిలకమెండంగి గ్రామానికి చేరుకున్నారు. రోడ్డు దుస్థితి చూసి ఆయన సెల్ ఫోన్‌తో ఫొటోలు తీశారు. గ్రామంలో గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కు జిల్లాలో ఘన స్వాగతం లభించింది. జిల్లా పర్యటనలో భాగంగా మక్కువ మండలం దుగ్గేరు పంచాయతీ బాగుజోలకు ఉప ముఖ్యమంత్రి చేరుకున్నారు. అక్కడ ఆయనకు రాష్ట్ర రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పుష్పగుచ్ఛాన్ని అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం కురుపాం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, పార్వతీపురం, పాలకొండ, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకష్ణ, లోకం మాధవి, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులుఉప ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలను అందించి ఘనంగా స్వాగతం పలికారు. అలాగే జనసేన నాయకులు కూడా స్వాగతం పలికారు. తొలుత మంగళ వాయిద్యాలు, పూర్ణకుంభంతో ఉప ముఖ్యమంత్రికి స్వాగతం పలుకగా, గిరిజన సంప్రదాయ థింసా నృత్యంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొని కాసేపు సందడి చేశారు.

కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ, సాలూరు, మక్కువ ఎంపీపీలు గురుగుబెల్లి రాములమ్మ, మర్రి పారమ్మ, మక్కువ జెడ్పీటీసి ఎం.శ్రీనివాసరావునాయుడు, కొరమ, పనసభద్ర ఎంపిటీసీలు కూనేటి గింద, సామంతుల వెంకటి, సర్పంచులు తాడంగి సుసుమ, సీదరపు గంగమ్మ, కెఆర్‌ఆర్సి ప్రత్యేక ఉప కలెక్టర్ పి. ధర్మ చంద్రారెడ్డి, డిఆర్‌ఓ కెహేమలత, వివిధశాఖల జిల్లా ఉన్నతాధికారులు గిరిజన గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా పటిష్ట బందోబస్తు

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పర్యటన విజయవంతానికి కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పీ ఎస్‌వి మాధవరెడ్డితో సహా జిల్లా అధికారులు నానా హైరానా పడ్డారు. ఒకప్పుడు మావోయిస్టులకు ఆలవాలమైన ఏజెన్సీ ప్రాంతంలో డిప్యూటీ సిఎం పర్యటించడం వల్ల జిల్లా అధికారులను తీవ్ర ఒత్తిడికి గురి చేసింది. ఒకవైపు తుపాను ప్రభావం వల్ల జోరుగా వాన పడుతుండడంతో పవన్ కళ్యాణ్ పర్యటన ఏ క్షణమైనా ఆగిపోతుందనే కొంతమంది భావించారు. అయితే డిప్యూటీ సిఎం పట్టుబట్టి మారుమూల గిరిశిఖర గ్రామానికి చేరుకోవడం పర్యటన విజయవంతం కావడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. పర్యటనకు ముందు గిరిశిఖర గ్రామాలన్నింటినీ పోలీసు అధికారులు జల్లెడ పట్టారు. బాగుజోలలో శంకుస్థాపన ప్రదేశానికి ఐదు కిలోమీటర్ల దూరం ముందే మీడియా వాహనాలను నిలిపివేశారు. దీంతో మీడియా ప్రతినిధులు దుగ్గేరు నుంచి ఐదు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సి వచ్చింది. బాగుజోలలో పవన్ కళ్యాణ్ చుట్టూ ఉన్న ప్రయివేటు, ప్రభుత్వ పోలీసుల బందోబస్తు కారణంగా మీడియా కవరేజీకు ఆటంకం ఏర్పడింది. పవన్ పర్యటన విజయవంతం కావడంతో జిల్లా అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.





కొండెక్కి చిలకమెండంగి గిరిజన గ్రామానికి వెళ్తున్న డిప్యూటీ సిఎం; కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేస్తున్న పవన్‌కల్యాణ్

నేడు మహిళా సాధికారతపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కొమరాడ

స్థానిక మండలంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం మహిళ సాధికారత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు రెండో అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షులు ఎస్.దామోదరరావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మహిళల కోసం ఎన్‌సిడబ్ల్యు సహకారంతో మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సదస్సులో ఐసిడిఎస్, డిఆర్‌పె, మెప్మా, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, మత్స్యశాఖ, వ్యవసాయశాఖ, వికలాంగుల సంక్షేమ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు. మహిళలు, పిల్లల ప్రయోజనం కోసం వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సదస్సులో అవగాహన కల్పిస్తారని అన్నారు. ఈ సదస్సులో కొమరాడ మండలానికి చెందిన వారంతా హాజరు కావాలని ఆయన కోరారు.

బడిదేవర కొండ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో

28న విస్తృతస్థాయి సమావేశం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

బడిదేవర కొండపై గ్రానైట్ తవ్వకాల అనుమతులు రద్దు చేయాలని కోరుతూ ఈనెల 28న మండలంలోని కోరి గ్రామంలో బడిదేవరకొండ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.కృష్ణమూర్తి, బంటు దాసు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పలు గ్రామాల ఆయకట్టు భూములకు సాగునీరందించే బడిదేవరకొండ తవ్వకాల వల్ల కనుమరుగైతే రైతులు తీవ్ర సంక్షోభానికి గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా పరిసర గ్రామ ప్రజలకు ఆరాధ్య దైవమైన బడిదేవర కొండపై తవ్వకాలు నిర్వహించి అపచారానికి పాల్పడుతున్న గ్రానైట్ కంపెనీపై తవ్వకాలను ఆపాలని తమ మనోభావాలను పరిగణలోకి తీసుకోవాలని అక్కడి ప్రజలు కోరుతున్నారని అన్నారు. ఈ విషయమై విస్తృతస్థాయి సమావేశంలో అన్ని పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు హాజరై భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తారని ప్రకటనలో తెలిపారు.

నేడు ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ

గజపతినగరం : ఎస్ఎఫ్ఐ విజయనగరం జిల్లా 32వ మహాసభలు గజపతినగరంలో శని, ఆదివారాల్లో జరగనున్నాయి. సభకు ముఖ్య అతిధులుగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.రామ్మోహన్ హాజరు కానున్నారు. మహాసభ జరిగే ప్రాంతానికి భగత్ సింగ్ నగర్‌గాను, ప్రతినిధుల సభ జరిగే స్థలానికి సీతారాం ఏచూరి ప్రాంగణంగా నామకరణం చేశారు.

జోరువానలో అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - సీతంపేట

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐటిడిఎ పరిధిలో గల గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు 32 రోజులుగా ఐటిడిఎ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారు. యధావిధిగా శుక్రవారం ఐటిడిఎ ప్రధాన గేటు వద్ద జోరువానలో ఉపాధ్యాయులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. 32 రోజులుగా వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకూ పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధర్మారావు, గణేష్, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు



వర్షంలోనూ నిరసన తెలుపుతున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

భామినిలో నీతి అయోగ్ బృందం పర్యటన

ప్రజాశక్తి -భామిని

పిఎంజన్ మాన్ కార్యక్రమంలో భాగంగా నీతి అయోగ్ ఆధ్వర్యంలో ఆస్పిరేషన్ బ్లాక్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఎంపికైన భామిని మండలంలో నీతి అయోగ్ బృందం శుక్రవారం పర్యటించింది. నీతిఅయోగ్ డిప్యూటీ సెక్రటరీతో కూడిన బృందం శుక్రవారం భామిని మండలంలోని నల్లరాయిగూడ, పాలీసుకోట, సన్నాయిగూడ, సొలికిరి గ్రామాల్లో పర్యటించింది. ఈ సందర్భంగా ఆ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సన్నాయిగూడలో గిరిజన ప్రైమరీ పాఠశాల, అంగన్వాడీ సెంటర్లను పరిశీలించి, అక్కడ ఉన్న మౌలిక వసతులపై ఆరా తీశారు. అనంతరం నల్లరాయిగూడను సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న వన్ ధన్ వికాస్ కేంద్రాన్ని పరిశీలించి, విడివికె సభ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విడివికెల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అన్నారు. గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య, పక్కా ఇళ్ల నిర్మాణాలు, విద్యుత్ సౌకర్యం, రోడ్లు సదుపాయాల వంటి విషయాలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. సొలికిరి, పాలిష్‌కోట గ్రామాల్లో పర్యటించి వన్‌ధన్ వికాస్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విడివికె సభ్యులు గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని కోరగా, దీనిపై స్పందించిన నీతి అయోగ్ డిప్యూటీ సెక్రటరీ గిరిజన ఉత్పత్తులకు పూర్తిస్థాయిలో మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నీతి అయోగ్ డిప్యూటీ సెక్రటరీ అరవింద్ కుమార్, యంగ్ ప్రొఫెషనల్ ఇంద్రజిత్ కుమార్, ఐటిడిఎ ఎపిఓ చినబాబు, మధుసూదన్ రావు, మహేష్, వాసన్ ఎన్‌జిఓ సభ్యులు, ఇతర మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



విడివికె సభ్యులతో మాట్లాడుతున్న నీతి అయోగ్ బృందం సభ్యులు

అడ్వెంచర్ పార్కును సందర్శన

సీతంపేట : ఐటిడిఎ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కును నీతి అయోగ్ బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా పార్కులో ఏర్పాటు చేసిన సాహస క్రీడలను పరిశీలించారు. పార్కు నిర్వహణ బాగుందని నీతి అయోగ్ డిప్యూటీ సెక్రటరీ అరవింద్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా 5డి థియేటర్‌ను సందర్శించారు. 5డి సినిమా అనుభవం అద్భుతంగా ఉందన్నారు.

ఏజెన్సీలో టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి ప్రచారం

ప్రజాశక్తి - కురుపాం

జోరు వానను సైతం లెక్కచేయకుండా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న కె.విజయగౌరి మండలంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు ఎన్.శ్రీరాములు, ఎం.చలపతిరావు, కె.రవి, వివి రమణ, పిడి జగన్నాథంతో కలిసి మండలంలోని గిరిజన సంక్షేమ, జిల్లా పరిషత్, ఆదర్శ పాఠశాల, కెజిబివి తదితర పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల కోసం నిరంతరం పోరాడుతూ, వారికి అందుబాటు ఉండి సమస్యలపై గొంతునై శాసనమండలిలో వినిపిస్తానని అన్నారు. కావున తనకు ఉపాధ్యాయులంతా ఓటు వేసి శాసన మండలికి పంపించాలని కోరారు.



ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి, ఉపాధ్యాయులు

వరి కుప్పలను ధ్వంసం చేసిన ఏనుగులు

ప్రజాశక్తి - భామిని

మండలంలోని వంశధార నది సమీపాన గల పంట పొలాల్లో సంచరిస్తున్న 4 ఏనుగుల గుంపు గురువారం రాత్రి పొలాల్లో టార్పియన్లతో కప్పి ఉంచిన ధాన్యం కుప్పను, పత్తి బస్తాలను, వరి కుప్పలను చెల్లా చెదురు చేసి ధ్వంసం చేశాయి. ఈ ఘటనలో గురిబిల్లి చలంనాయుడు చెందిన వరి కుప్ప, గురిబిల్లి జోగినాయుడుకు చెంది పత్తి, గురిబిల్లి బాలకృష్ణకు చెందిన నిల్వ చేసిన ధాన్యం బస్తాలు ధ్వంసమయ్యాయి. శుక్రవారం సాయంత్రం సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వ్యవసాయశాఖ అధికారులు 15 బస్తాలు వరి, క్వింటా పత్తి నష్టం జరిగినట్టు రైతులు తెలిపారని చెప్పారు. నష్టపోయిన ధాన్యం, పత్తికి నష్ట పరిహారం అందించేలా చూడాలని అధికారులను రైతులు కోరుతున్నారు.



ఏనుగులో ధ్వంసం చేసిన ధాన్యం



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ఘనస్వాగతం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

తొలిసారిగా జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డికి శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్ర ఘన స్వాగతం పలికారు. శనివారం స్థానిక ఆర్‌టిసి డిపోలో కొత్త బస్సులను మంత్రి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిస్థితులపై పలు అంశాలను మంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. అనంతరం సీతానగరంలో బస్ షెల్టర్, మండలంలో నర్సిపురం గ్రామ సమీపంలో డ్రైవర్ శిక్షణా మైదానం, అనంతరం ఎస్‌విడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద క్రీడా సముదాయానికి మంత్రి ప్రారంభోత్సవం చేయనున్నారు. మంత్రికి స్వాగతం పలికిన వారిలో బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు బార్నాల సీతారాం, కోలా మధు, మజ్జి వెంకటేష్, రౌతు వేణు, బోను చంటి, జనసేననాయకులు చంద్రక అనిల్ నాయకులు పాల్గొన్నారు.



ఎన్నికైన అభ్యర్థికి నియామక పత్రాన్ని అందజేస్తున్న ప్రత్యేక అధికారి

20 గ్రామాల్లో పీసా ఎన్నికలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని 20 గ్రామాల్లో పీసా ఎన్నికలు నిర్వహించి ఉపాధ్యక్షులు, కార్యదర్శులను ఎన్నుకున్నారని పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి ప్రకటనలో తెలిపారు. కొన్ని చోట్ల ఎన్నికలు ఏకగ్రీవం కాగా, మరికొన్ని చోట్ల ఎన్నికలు జరిగాయని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు. అధికారులు ఎన్నికల అధికారులకు వ్యవహరించారని పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

తుఫాను ప్రభావం వలన మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని, వీటిని దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, బి.ప్రదీప్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామాల్లో సందర్శించి ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవాలన్నారు. జ్వర పీడితులను గుర్తించి వారి నుంచి రక్త పూతలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జనార్ధనరావు, ఆదిలక్ష్మి, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

దళితులంటే ఎందుకంత నిర్లక్ష్యం?

ప్రజాశక్తి - సీతానగరం

వెనుకబడి ఉన్న దళితు కాలనీల్లో మౌలిక వసతుల కల్పనలో పాలకులు ఎందుకంత నిర్లక్ష్యం వహిస్తున్నారని మండలంలోని రంగంపేట పంచాయతీ మధుర గ్రామమైన అనంతరాయుడుపేట గ్రామ దళితుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామంలో కనీస మౌలిక సదుపాయాల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల కావస్తున్నా ఎలాంటి అభివృద్ధి పనులు జరగడంలేదని వారన్నారు. వెనుకబాటుకు గురవుతున్న దళిత, గిరిజనుల నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు, పాలకులు తమ అనుయాయులు, రాజకీయ పలుకుబడి ఉన్న పెద్దల నివాసాల్లో మౌలిక సదుపాయాల పనులు ప్రారంభించడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన దళితులు ఈ కూటమి ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం జరుగుతుందని అనుకోవడం ఎండమావుల్లో నీరు వెతుక్కోవడం చందంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి దళిత పేటలో సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆగ్రామానికి చెందిన దళితులు రాయిపల్లి గౌరు, సింహాచలం, రాము, వెలగాడ వెంకటి, వెలగాడ చిన్నమ్మ తదితరులు కోరుతున్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్రీవరం

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీ వరం మాట్లాడుతూ విద్యార్థులు తమ కెరీర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు అభివృద్ధికి, ఉన్నత శిఖరాలకు కావాల్సిన మార్గాల గురించి ఆమె తెలిపారు. ఈ కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించేందుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన నేషనల్ కెరీర్ సర్వీస్ సంస్థ సభ్యులు అజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తమ చదువుతో పాటు అనేక సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ సంపాదించాలని విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు ఇవి చాలా అవసరమని అన్నారు. విద్యార్థులు డిగ్రీ కోర్సు తర్వాత చేయాల్సిన వివిధ కోర్సులు, జాబ్స్ గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఎసి సభ్యులు కల్పన, కళాశాల ఎకనామిక్స్ లెక్చరర్ స్వరూప, పాల్గొన్నారు.

వర్షాల సమయంలో జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను కారణంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు ఇంట్లో ఉన్న విద్యుత్ స్విచ్ బోర్డులను తడిచేతులతో వేయం, ఆపడం చేయవద్దని విద్యుత్ శాఖ ఎఇ బడే శ్రీనివాసనాయుడు వెల్లడించారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చిన్నపిల్లలు విద్యుత్ పరికరాలు తాకకుండా చూసుకోవాలన్నారు. ఇళ్లలో వైర్లు తెగినా, జాయింట్లు తెగినట్లయితే తక్షణమే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాల్సి ఉందని తెలిపారు. తడిసిన విద్యుత్ మీటర్లను ఎటు వంటి పరిస్థితుల్లో ముట్టుకోవద్దని చెప్పారు. ఇంటి పరిసరాల్లో, విద్యుత్తు స్తంభాలు చెట్లు మీద పడినట్లయితే సమీపంలోని విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్నందు వల్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇప్పటికే గ్రామస్థాయి విద్యుత్ శాఖ సిబ్బందికి తగు సూచనలు, సలహాలను అందజేశామని ఎఇ తెలిపారు. సమావేశంలో మండల విద్యుత్ శాఖ జూనియర్ ఇంజనీర్ బొంతాడ శంకరరావు వున్నారు.

పాఠశాల భవనాన్ని పునర్నిర్మించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కురుపాం

శిథిలావ్యవస్థలో ఉన్న ఉదయపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాల భవనాన్ని పునర్నిర్మానం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె.రాజు డిమాండ్ చేశారు. మండలంలో గల ఉదయపురం ఆశ్రమ పాఠశాలను ఎస్ఎఫ్ఐ నాయకులు బి.రమేష్‌తో కలిసి ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో 222 మంది విద్యార్థులు చదువుతున్నారని, భవనం పూర్తిగా పాడై శిథిలా వ్యవస్థలో ఉండడం వల్ల విద్యార్థులు రాత్రిపూట తరగతి గదుల్లోనూ, వరండాల్లో నిద్రించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. చలికాలంలో చలికి తట్టుకోలేక అనేక ఇబ్బందులను గిరిజన బాలిక విద్యార్థినిలు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాగే మూడేళ్లుగా ఫిజిక్స్ ఉపాధ్యాయులు లేకపోవడం విద్యార్థులు చదువులకు చాలా ఇబ్బంది పడుతున్నారని, మరో రెండు నెలల్లో పదో తరగతి పరీక్షలు రాయడానికి సిద్ధమవ్వాలని, కాని ఇప్పటికీ ఉపాధ్యాయుల్లేకపోతే విద్యార్థులు ఏం చదివి పరీక్షలు రాస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఫిజిక్స్ ఉపాధ్యాయిని వెంటనే నియమించి విద్యార్థులకు చదువులు అందించడంతో



శిథిలావస్థలో ఉన్న పాఠశాలను పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజు

పాటు శిథిలావ్యవస్థలో ఉన్న భవనాన్ని పునర్నిర్మాణం చేసి ఎఎన్ఎం, వాచ్మెన్‌ను మించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. లేకుంటే భవిష్యత్తులో విద్యార్థుల సమస్యలపై ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పింఛన్ల తొలగింపునకు కుట్ర

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పెన్షన్‌దారులపై పగ పట్టిందని, వారు పింఛన్లు తొలగించినందుకు కుట్రలు చేస్తుందని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆరోపించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక పెన్షన్లు పొందుతున్న పండుటాకులపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టిందని, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పెన్షన్లను తొలగించేందుకు కుట్ర జరుగుతోంది అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఏకంగా మూడు లక్షల పెన్షన్ లను తొలగించిందని, భవిష్యత్తులో భారీగా పెన్షన్ల కోత దిశగా అడుగులు వేస్తోంది అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, గతం నుంచి అమలవుతున్న పథకాలను కూడా ఆపేస్తామంటున్న కూటమి ప్రభుత్వ విధానాలను ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీ నెరవేర్చకపోగా, అమలు చేస్తున్న వాటిలో కూడా కోత పెడుతున్నారన్నారు. ప్రతి వైఫల్యానికి గత ప్రభుత్వాన్ని నిందించడం, ఏ పని చేయకున్నా, అన్నీ చేస్తున్నట్లు తమ అనుకూల మీడియాలో ప్రచారం చేసుకోవడం చంద్రబాబు ప్రభుత్వానికి అలవాటుగా మారిందని విమర్శించారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం కచ్చితంగా ప్రజల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని తెలిపారు. సమావేశంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -గరుగుబిల్లి

తుఫాన్ ప్రభావం వల్ల మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు రక్షిత మంచి నీటి పథకాల్లో తాగునీటి నిల్వ చేయడం జరిగిందని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ జి.గౌరీశంకర్రావు శుక్రవారం తెలిపారు. తుఫాను కారణంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలను గురించి వివరించారు. గ్రామాల్లోని రక్షిత మంచి నీటి పథకాల్లో క్లోరినేషన్ చేయించామన్నారు. అనంతరం రక్షితమంచి నీటి పథకాల్లో పూర్తి స్థాయిలో తాగునీరు నిల్వ చేయాలని వెల్లడించారు. తుఫాన్ కారణంగా ఆయా గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా ఉండేలా ముందు జాగ్రత్తలు తీసుకున్నట్టు ఎఇ తెలిపారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తం

ప్రజాశక్తి - కొమరాడ

వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని కెఆర్‌బి పురం, కొమరాడ పిహెచ్‌సిలను, కుమ్మరిగుంట గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సీజనల్ వ్యాధులు, జ్వరాలు ఎక్కడైనా నమోదవుతున్నాయా, వాటి ప్రభావం ఏ మేరకు ఉంటుందని వైద్యాధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఒపి, ఐపి, ల్యాబ్, పార్చురిషన్ రికార్డులు తనిఖీ చేసి ఆరోగ్య తనిఖీలు, వైద్య పరీక్షల వివరాలు, నివేదికల ద్వారా వైద్యసేవలు అందుతున్న తీరును పరిశీలించారు. అక్కడ రోగులతో మాట్లాడి ఆరోగ్య సమస్యలు తెలుసుకొని సిబ్బందికి తాడు సూచనలు చేశారు. కొమరాడ పిహెచ్‌సిలో అప్పుడే ప్రసవం జరిగిన తల్లీబిడ్డల ఆరోగ్య స్థితిని తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో సమీక్షించి గ్రామాల్లో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా తదితర సీజనల్ వ్యాధులు ఎక్కడ నమోదైనా ఆరోగ్య పర్యవేక్షకులు, వైద్య సిబ్బంది వెంటనే క్షేత్ర స్థాయిలో నివారణా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో విరివిగా వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. తాగునీరు విషయమై ప్రజలను అప్రమత్తం చేయాలని, కాచి చల్లార్చిన నీటిని తీసుకునేలా అవగాహన కల్పించారు. నీటి స్వచ్ఛత పరీక్షలు నిర్వహించాలన్నారు. మారుమూల, గిరిశిఖర గ్రామాల్లో ప్రాథమికంగా అవసరమైన మందులు, పరీక్షలు అందుబాటులో ఉంచాలన్నారు. అక్కడ గర్భిణులను ప్రసవ గడువుకు నెల ముందుగానే గర్భిణీ వసతి గహాల్లో చేర్చాలన్నారు.



వైద్యాధికారులకు, సిబ్బందికి సూచనలు చేస్తున్న జగన్మోహనరావు

ప్రస్తుతం కొనసాగుతున్న ఆరోగ్య సర్వేల తీరుపై ఆరా తీశారు. డా. బిఆర్ అంబేద్కర్ గురుకులం హాస్టల్ లో విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్ పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శిరీష, డాక్టర్ శామ్యూల్, డాక్టర్ గణేష్ పట్నాయక్, సిహెచ్ఒ బంగారుబాబు, ఎపిడిమిక్ ఇఒ సత్తిబాబు, సూపర్వైజర్లు శోభ, శారద, నిర్మల, బద్రినారారాయణ, జయగౌడ్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఫిర్యాదులను పరిశీలిస్తున్న తహశీల్దార్ జయలక్ష్మి

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గ్రామీణ ప్రాంతాల్లో భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు వై.జయలక్ష్మి అన్నారు. గత కొద్దిరోజులుగా దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లిన ఆమె శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం మండలంలోని బాలగొడబ, జగన్నాథపురం, రంగరాజపురం రెవెన్యూ గ్రామాలకు చెందిన భూములపై రెవెన్యూ సదస్సుల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు దరఖాస్తుదారుల నుంచి భూమికి సంబంధించిన సమస్యలను పరిష్కారం కోరుతూ దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాన్ని నిర్వహిస్తున్న ఈ రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ రామచంద్రరావు, సర్పంచి, గ్రామస్తులు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సలు చేసిన వారికి నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - కురుపాం

కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఇటీవల కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల పరిధిలో గల సచివాలయల్లో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాల్లో కేటరాక్ట్ (అంతర కుసుమం), టెరిజియం (కొయ్యకండ) లోపం ఉన్నవారికి శస్త్ర చికిత్సలు నిర్వహించినటుల నేత్రవైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించి 15రోజుల తర్వాత స్థానిక సిహెచ్‌సిలో శుక్రవారం నేత్ర పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేసి పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర సురేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



జాతాలో మాట్లాడుతున్న నీడ్ డైరెక్టర్ వేణుగోపాలరావు

బాల్యవివాహాలపై కళాజాతా

ప్రజాశక్తి - పాచిపెంట

బాల్యవివాహాల నివారణ, ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవం, సికిల్‌సెల్ఎమియా, రక్తహీనత, చేతులు పరిశుభ్రత తదితర అంశాలపై మండలంలోని బొబ్బిలివలస, పనుకువలస, మంచాడవలస గ్రామాల్లో గిరిజనులకు నీడ్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహణలో శుక్రవారం కళాజాతా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నీడ్ డైరెక్టర్ పి.వేణుగోపాలరావు మాట్లాడుతూ గ్రామాల్లో బాల్యవాహాల నివారణను అడ్డుకోవాలని, గ్రామాలు పరిశుభ్రతగా ఉండాలని, గిరిజన గిరిశిఖర గర్భిణుల వసతి గృహంలో చేరాలని సూచించారు. అలాగే చేతులు పరిశుభ్రతగా ఉండాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు బి.కనకరత్న, మహేష్, మోహన్ రావు పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరం... సమస్యలు భారం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తాగేందుకు స్వచ్ఛమైన మంచినీరు లేదు... తల దాచుకోడానికి సరైన పక్కా గృహాల్లేవు. ఇక్కడి గిరిజనులు అభివృద్ధికి ఆమడ దూరంగా సమస్యలతో సహజీవనం చేస్తున్నారు.

మండలంలోని పెద్దఖర్జ పంచాయతీ సప్పగూడ గిరిజన గ్రామంలో 21 కుటుంబాలు ఉన్నాయి. గ్రామం ఏర్పడి 40 ఏళ్లు దాటిన కనీస మౌలిక వసతుల్లేక గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తాగేందుకు మంచి నీరు లేక, పక్కా గృహాలు మంజూరు కాలేదని చెబుతున్నారు. గ్రామంలో బోర్లు లేకపోవడంతో కొండవాగుచలం, బావినీటిపై ఆధారపడి జీవిస్తున్నారు. వేసవి వచ్చిందంటే కొండవాగు నీరు పూర్తిగా ఇంకిపోవడంతో



ఊటబావి నీటిని పడుతున్న సప్పగూడ మహిళలు

కానరాని మౌలిక సౌకర్యాలు ఇదీ సప్పగూడ గిరిజనుల దుస్థితి



పక్కాగృహాలు, కాలువలు, రోడ్లు లేని సప్పగూడ గ్రామం

ఆధారపడుతున్నారు. పక్కా గృహాల్లేకపోవడంతో శిథిలమైన రేకిళ్లలోనే తలదాచుకుంటున్నారు. టిడిపి హయంలో రెండు పక్క ఇళ్లు మాత్రమే నిర్మాణం జరిగిందన్నారు. మెయిన్ రోడ్ నుంచి గ్రామం వరకు సిసి రోడ్డు నిర్మించాలని, ఐటిడిఎ ద్వారా ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే తమ గ్రామంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఐటిడిఎ అధికారులను కోరారు.



గోతుల మయమైన సాలూరు-దండిగాం రోడ్డు

గంజానికో గుంత...

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని దండిగాం- సాలూరు రహదారిపై గంజానికో గుంత ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుంతల్లేని రోడ్లు చేస్తామని ముఖ్యమంత్రి నుంచి గ్రామస్థాయి నాయకులు ఊదరగొడుతున్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహించి సంక్రాంతి నాటికి రాష్ట్రంలో ఎక్కడా గుంతలు లేకుండా రాష్ట్రంలోని అన్ని రహదారులను అద్దంలా తయారు చేస్తామని చెప్పారు. సంక్రాంతి దగ్గర పడుతున్నా ఇప్పటికీ మండలంలో ఎక్కడా రోడ్డు పనులు ప్రారంభించిన దాఖలాల్లేవు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే సాలూరు-దండిగాం రోడ్డులో మున్సిపల్ పరిధిలో సాలూరు నుండి బొడ్డవలస వరకు మాత్రమే కొద్దిగా గుంతలు లేకుండా చేశారు. బొడ్డవలస నుండి కురుకుట్టి వరకు ఎక్కడా ఒక్క రాయి పిక్క కూడా వేయలేదు. మండలంలో సాలూరు నుండి మక్కువ రోడ్డు, మామిడిపల్లి నుంచి బాగువలస, గడబ బొడ్డవలస నుంచి కొత్తవలస, బంగరమ్మపేట నుంచి కుర్మారాజుపేట మండలం మొత్తంగా ఏ ఊరు రోడ్డు చూసిన గుంతలే. మరి పాలకులు సంక్రాంతికి పూర్తి చేస్తామన్నది అవుతుందో లేదో చూడాలి మరి.

క్రీడాంధ్ర ప్రదేశే లక్ష్యం : మంత్రి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

క్రీడలను ప్రోత్సహించి క్రీడాంధ్ర ప్రదేశ్‌గా రూపొందించే లక్ష్యంతో దేశంలోనే అత్యుత్తమ క్రీడాపాలసీని తీసుకు వచ్చామని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసులు, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. అన్ని నియోజక వర్గాల్లో క్రీడా వసతులను కల్పిస్తామని తెలిపారు. నగరంలోని విజ్జి స్టేడియంలో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించిన మల్టీ పర్పస్ ఇండోర్ హాల్‌ను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజుతో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇండోర్ హాల్‌లో కలెక్టర్ అంబేద్కర్, శాప్ ఎమ్‌డి గిరీశతో కలిసి వారు షటిల్ ఆడారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదేళ్లలో క్రీడారంగం నిర్వీర్యం అయ్యిందన్నారు. క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రస్తుతం వున్న 2 శాతం రిజర్వేషన్‌ను 3 శాతానికి పెంచినట్లు పేర్కొన్నారు. వచ్చే జాతీయ క్రీడలను 2027లో అమరావతిలో నిర్వహించేందుకు ప్రణాళిక బద్ధంగా సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడా పాలసీలో భాగంగా విజయనగరంలో స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి చెప్పారు. ఎమ్మెల్యే అదితి గజపతి మాట్లాడుతూ 1983లో ఈ స్టేడియంను నాటి ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు ప్రారంభించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో శాప్ ఎమ్‌డి. గిరీశ, జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్, డిఎస్‌డిఒ వెంకటేశ్వర రావు, డిప్యూటీ



ఇండోర్ హాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రవాణా కమిషనర్ మణి కుమార్ పాల్గొన్నారు.

ఆర్‌టిసికి మంచి రోజులు : మంత్రి

విజయనగరంకోట : ఎపిఎస్ ఆర్‌టిసికి మంచి రోజులు రానున్నాయని మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. త్వరలో ఆర్‌టిసిలో విద్యుత్తు బస్సులను వేస్తామని తెలిపారు. శుక్రవారం విజయనగరం ఆర్‌టిసి డిపోలో 10 కొత్త బస్సులకు జెండా ఊపి మంత్రి ప్రారంభించారు. రెండు బస్సులు విజయనగరం నుండి శ్రీకాకుళానికి కాగా మిగిలినవి అనకాపల్లి, శ్రీకాకుళం డిపోలకు చెందినవి. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి ఉద్యోగులకు నైట్ అవుట్ అలవెన్స్ మంజూరు చేశామన్నారు. ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని తెలిపారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ భవిష్యతులో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టే ఆలోచనలో ప్రభుత్వం ఉందని తెలిపారు. ఎమ్మెల్యే పి.అదితి గజపతిరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్‌టిసిని నిర్వీర్యం చేసిందన్నారు. ఆర్‌టిసి జోనల్ చైర్మన్ దున్ను దొర మాట్లాడుతూ ప్రయాణికులను గౌరవిస్తూ, వారికి నమ్మకం కలిగేలా పని చేయాలన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన డ్రైవర్లకు, కండక్టర్లకు ప్రశంసా పత్రాలను, నగదు పారితోషికాన్ని మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌టిసి ఇడి విజయకుమార్ , జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పల నారాయణ, డిప్యూటీ సిటిఎం సుధాబిందు, ఆర్‌టిసి ఉద్యోగ, కార్మికసంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మంత్రికి ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకుల వినతి

రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ఆర్‌టిసి డిపో ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు పలు సమస్యలపై వినతినిచ్చారు. డిపోలో ఆర్టీసీలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని, 1/2019 సర్కులర్‌ను యధావిధిగా అమలు చేయాలని, కార్మికులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని కోరారు. ఎలక్ట్రానిక్ బస్సులను ఆర్‌టిసికె ఇవ్వాలని కోరారు.